# తెలివిమాలిన తగువు

★

రచన: గొల్ల శివాజీరావు

"అమ్మా! మరేమో మన తెల్ల కోడిపుంజును వెంకమ్మ గారు కొట్టిందే" అని కాంతం ఏడేళ్ళకొడుకు వాసు, బియ్యంలో బెడ్డువేరుతున్న తల్లితో గుక్కతిప్పకోకుండా వాళ్ల పక్కింటి ఆవిడపై ఫిర్యాదుచేశాడు.

అప్పటివరకూ నిశ్చింతగా తన పని చేసుకుంటున్న కాంతమ్మ కొడుకుచెప్పిన విషయం వినగానే తను చేస్తున్న పని మానేసి రౌద్రమూర్తయి అన్నెం పున్నెం ఎరుగని కోడి పుంజును కొట్టడానికి చేతులెట్లావచ్చాయిరా? దానమ్మ కడుపుకాల" అని యింకా యేమేమో అంటూ తగువుకు నాందీ ప్రస్తావన జరిపింది.

అగ్గికోసమని వీరమ్మ, ఎదురింటి ఎల్లమ్మ, అచ్చమ్మ వగైరాలంతా కెనేడియన్ రైలుయింజనును మించి గోల చేస్తున్న కాంతం గొంతుక ధ్వనిని విని బిరబిర వచ్చారు.

"ఏం జరిగిందీ?" అని అడిగింది అమాయకంగా ఎల్లమ్మ.

వాసు జరిగిన విషయమంతా చెప్పాడు.

విరామంలేకుండా గొంతుక చించుకొని తిడుతున్న కాంతం నుద్దేశించి, "కోడిపుంజు కాలు విరిగిందేమో చూడక్కా" అంది వరసకలుపుతూ వీరమ్మ.

"మరేమిలేదమ్మా. ఇంకోపుంజయితే వాళ్ళు యేం జేసినా యిబ్బందిపడకపోదును. ఈ తెల్లకోడిపుంజును మీ బావగారు కాకినాడనుంచి మక్కువపడి పదిరూపాయలకు తెచ్చారు. "ఒకళ్ళు పచ్చగావుంటే చూచి ఓర్వలేనిపొరుగు మనది. మీరు కోడినితెచ్చినా వీళ్ళు బ్రతకనివ్వరని, నేను ఆయనకు శతవిధాల చెప్పాను. కాని, నామాట వింటేగా?" అంది కాంతం చూడ్డానికివచ్చినవాళ్ల బుర్రల కెక్కేలాగు అతి ప్రశాంతంగా.

అప్పటికి మరో నలుగురు అమ్మలక్కలు వచ్చారు తలకొక మాటా. కాంతం వినిపించుకోకపోయినా అంటూ "మాట సాయం" మాత్రం చేస్తున్నారు.

"ఇప్పుడు నీశాపనార్థాలకు, తిట్లకు తొందరేమొచ్చింది గానీ, ముందు ఆ కోడిపుంజు కాలువిరిగిందేమో చూడు" అంది అక్కడేవున్న ఓ పతివ్రతా శిరోమణి. నలుగురూ వినేందుకు తను చెప్పేమాటలస్థాయి హెచ్చిస్తూ కాంతం జవాబు చెప్పకపోయినా మరో తీర్పుకర్త.

"ఇప్పుడేం తెలుస్తుందీ, కాలు విరిగిందీ, లేనిదీనూ. మంచి తిమ్మిరిమీద ఉంటుంది. ఏమయిందీ ఓ పావుగంట పోతేనేగాని తెలీదు" అంది తనకే మహా తెలుసుననే గర్వం చెప్పేమాటలలోనూ. చూచే చూపులలోనూ వ్యక్తంచేస్తూ.

"ఇంతకీ కోడిపుంజు యెక్కడుందీ?" అంతా మాట్లాడుతున్నారనే అక్కసుతో అంది వీరమ్మ. గొంతుక నొప్పి పెట్టడంచే కాంతం తిట్లుమానేసి "నాకు తెలియదు" అనే భావం వ్యక్తంచేస్తూ వాసువైపు చూచింది.

"వీధిలో గింజలు ఏరికొని తింటున్నది" వాసు సమాధానం.

కాంతం గబగబా యింట్లోకిపోయి చెంబుడు మంచి నీళ్ళు గడగడా త్రాగేసివచ్చి మళ్ళీ శాపనార్థాలు లంకించుకొంది "కోడిపుంజుకాలు విరగాలి. వెంకమ్మ రెండోకాలు కూడా విరిచేస్తాను. ఏమనుకుంటున్నదో నా సత్తా యింకా తెలియలేదు దానికి" అంటూ.

"అమ్మా, కోడిపుంజుని వెంకమ్మగారు కొట్టడం నేను కళ్ళారా చూశానే. నాకు యేడుపొచ్చిందంటే నమ్ము" అన్నాడు వాసు అమాయకంగా, తను చెప్పేమాటలవల్ల తగువు పెరుగుతుందేకాని తరుగదు అని తెలుసుకోకుండా.

ఇంతవరకూ వాళ్ళు యేమి అనుకున్నా వెంకమ్మ కదనరంగంలో ప్రవేశించలేదు. ఇంట్లోనే ధైర్యవదనంతో కూర్చుంది. కాంతం, తదితర ప్రమదలు అంటున్నమాటలు సూదిపోటుల్లా గుచ్చుకొని బాధాకరంగా వున్నా, అతికష్టం మీద సహించుతుంది.

"మనిషై పుట్టినందుకు జీవరాసిపై దయచూపాలని చెట్టంత వెంకమ్మకు అమాత్రం తెలీదూ?"

"నోరూ; వాయీలేని కోడినికొడితే యే మొచ్చింది దాన్ని బాధించడంతప్ప."

"మీ ఇంట్లోకి వాళ్ళకోళ్ళు వస్తాయిగదూ! అప్పుడు వాటిని పచ్చడిచేస్తే వెంకమ్మరోగం కాస్తా చప్పబడుతుంది."

ఇన్ని తిట్లుతిడుతున్నా సంజాయిషీ చెప్పకోడానికి రాలేదు చూశారా! దీన్నిబట్టియైనా కోడిని కొట్టిందని అనుకోవచ్చు."

షైవాక్యాలు ఒకదానితర్వాత ఒకటిగా వెంకమ్మ సహనాన్ని కొండబ్రద్దలుకొట్టినట్లు బ్రద్దలుకొట్టాయి. కాంతం మిత్రబృందం అంటున్న దెప్పిపొడుపు మాటలను వెంకమ్మ సహించలేకపోయింది. విరిగిపోతే వచ్చిన సొట్ట కాలును కూడదీసుకొని ఒక్కసారిగ యుద్ధభూమికి హాజరయింది.

వెంకమ్మను చూడగానే కాంతం తరపున తిడుతున్న నలుగురినోళ్ళకూ అమాంతంగా తాళాలు నొక్కబడింది.

"ఏమండీ కాంతమ్మగారూ! ఏమిటి అంటున్నారు" అంది వెంకమ్మ అతికష్టంమీద. "నేనేమీ జ్ఞానంలేని పశువును గాదండోయ్ మీకోడిని కొట్టడానికి."

"మీరు కొట్టినట్టు మా అబ్బాయి చూశాడని చెబుతున్నాడుగదూ?" కాంతం సూటిగా ప్రశ్నించింది; వెంకమ్మ జవాబుకోసం కొంతసేపు తికమకపడింది.

"మీ కోడిపుంజు మా ఇంట్లోకివచ్చి బస్తాలు పొడిచి ధాన్యం తింటున్నది. కొడితే తప్పా? మీకుముద్దుగాని మాకు కాదుగా? ఐనా ధాన్యంతింటుంటే ఎవరు సహిస్తారూ? మీకు ఆ కోడిపైన తీరని మోజుఐతే ఇంట్లోకట్టి పెంచుకోవాలి గాని వీధిలో వదిలితే అంతా మీవతే చూడాలని ఎక్కడ రాసివుంది, కష్టంగావుంటే మా ఇంటికి రావద్దు'' అని చెప్పితే మానేస్తాంగాని, అనవసరంగా తిడితే పడడానికి ఇక్కడ యెవరూలేదు'' అంది వెంకమ్మ మంచి తీక్షణంగా.

సొట్టకాలు వెంకమ్మ జవాబు వినగానే కాంతంకు మరికొంచెం కోపం ఎక్కువై, "ఏమిటీ కొడతావా? కొట్టు ఈసారి నీకోడి మా ఇంటికి వస్తుందిగా అప్పుడు చెప్తాను దాని పని'' అంది.

వెంకమ్మ-కాంతం ఇద్దరూ హద్దుమీరిపోయారు. వాళ్ళు చేస్తున్న వాగ్వివాదంలో ఏనాడోచచ్చి యీ లోకాన శాంతి లేకపోయినా, స్వర్గంలో ప్రశాంతజీవనం గడుపుతున్న ఇరువైపుల పెద్దలపేర్లూ ప్రముఖపాత్ర వహించినయ్. ఇరు పక్షాలనున్న సహాయకులంతా ఇద్దరిస్థితినీ ఆశ్చర్యంతో చూస్తున్నారు.

లాలోచిపడివచ్చినట్టు ఒక్కసారిగా వచ్చారు రెండు వైపులనుంచీ వెంకమ్మభర్త రాజు, కాంతంభర్త రావూనూ. రాజు వెంకమ్మను, రావు కాంతంనూ చితుకబాది ఇంట్లోకి గెంటి వాళ్ళిద్దరూ ఒకళ్లవైపు ఒకరు అతికోపంగా చూసుకొని ఇంట్లోకి వెళ్ళిపోయారు. మగవాళ్ళిద్దరూ రావడంచూచిన "అమ్మలక్కలు'' తుపాకీగుండుకుకూడ దొరకకుండా ఎవరింటికి వారు ఉడాయించారు.

అతిస్నేహంగా వుంటున్న ఆ రెండుకుటుంబాలమధ్య వచ్చినయుద్ధం యీవిధంగా చల్లారింది.

* * * *

ఆ వీధిలోనేగాకుండా, ఆ ఊరికే మణిహారమైంది. రావు, రాజుగార్ల కుటుంబస్నేహం. విభిన్నకులాలవారైనా స్నేహపాశంచే అతిసన్నిహితంగా బ్రతకవచ్చు అనే సూత్రానికి దృష్టాంతంగా పై కుటుంబాలను నలుగురూ చెప్పుతుండేవారు. అతిసన్నిహితంగావుండే రావూ, రాజూలుకూడ మాట్లాడుకోవటంలేదు. అటువంటప్పుడు వెంకమ్మమాత్రం కాంతంగడప ఎలాతొక్కుతుంది? రెండు కుటుంబాలను చిరకాలంనుంచి పెనవైచుకొనివున్న "స్నేహపాశం'' ఒక్కసారిగా తెగి, దానిస్థానే ఇప్పుడా రెండు కుటుంబాలమధ్యా వైరం అల్లుకొంది.

కోడిపుంజుకాలు విరిగినమాట నిజం కాకపోయినా, రెండుకుటుంబాలమధ్య పరస్పర వైషమ్యాలు పెరిగాయన్న వార్త యథార్థం. విజ్ఞానం అణుశక్తివరకూ పెంపొందిన నేటికాలంలోకూడ ఇంత అల్పమతులున్నారా'' అని నేను అప్పుడప్పుడు చింతిస్తుంటాను.


## మావద్ద దొరకు గ్రంథములు

**ఉత్తరరామాయణము (పద్యకావ్యము)**

శ్రీ కంకంటి పాపరాజు కవి విరచితంబైన శ్రీమద్రామాయణమునందలి ఉత్తరకాండము, ఇందు రావణాదులు జననము, రావణుని చర్యలు, సీతవనవాసము, కుశలవుల జననము, అశ్వమేధయాగము, రామాయణ పారాయణము, కుశలవుల పట్టాభిషేకము మొదలగు అనేక ఘట్టములు కల్గిన ఈ గ్రంథమును రాయలప్రాంతములోని బాలబాలికలకు పఠన గ్రంథముగా నేర్పరుపబడుటచే పాఠకుల కనువగునటుల అతి శుభ్రమైన గ్లేజుకాగితముల మీదుగా అచ్చొత్తించినాము. పూర్తి క్యాలికోబైండుపైన శృంగారమైన జాకెట్టుకవరు.

వెల రు. 6—0—0

**భట్టి విక్రమాదిత్యుని కథ**

దీనిలో భోజరాజు జననము మొదలుకొని విక్రమాదిత్యుడు ముప్పదిరెండు సింహాసనము లెక్కినదియు, అడవియందు దారునెలలు ఇంటియందారునెలలు గడపినదియు, భేతాళుడు చెప్పిన ఇరువది నాలుగు కథలును, ప్రతిమలు చెప్పిన ముప్పది రెండు కథలును, చాలాకాలము రాజ్యముచేసిన విధములును గలవు. ఒక్కొక్క కథకు దగినట్లు చిత్రమైన పటములతో నాణ్యమైన క్యాలికోబైండు, అందమైన త్రివర్ణ జాకెట్టుతో 530 పేజీలుగల గ్రంథము.

వెల రు. 3—8—0

**శ్రీ భగవద్గీత శ్లోకతాత్పర్యము**

ఇందులో చాలా విశదంబుగ జనులు తెలుసుకొనుటకు గాను తాత్పర్యంబును వ్రాయబడియున్నది. మీరు భగవద్గీత చదివియే ముక్తిపొందుటకు మార్గము. వెల రు. 2—0—0

**కాశీ, రామేశ్వర మజిలీ కథలు**

ఇందు నీతి, ధర్మ, వేదాంత, మత సాంఘిక నియమాఖ్యాయికములు కలిగి ఒక్కొక్క కథను ఒక్కొక్క క్రొత్త వింతను వెలయించుచుండును. ఇది స్త్రీ పురుషులందరు చదువుటకు తేటతెనుగున బోధపడునట్లు సులభశైలిని 27 కథలును కాంచిపురమునుండి బయలుదేరి కాశికిపోయి కాశి నుండి రామేశ్వరమువరకు 17 మజిలీలుగా ముద్రించియున్నది. వెల రు. 2—0—0

**స్త్రీ భక్తవిజయమను మహాపతివ్రతల కథలు**

ఇందులో స్త్రీలు మోక్షమొందుటకుగాను 20 మహాపతివ్రతల కథలుగలది. బహు అద్భుతంబుగా వ్రాయబడియున్నది. వెల రు. 1—8—0

**హిందీ విద్యాబోధిని**

తెలుగక్షరములు తెలిసిన ప్రతివారు ఈగ్రంథసహాయంవల్ల ఒకనెలలోనే హిందీ భాషను నేర్చుకొనవచ్చును. ఉచ్చారణ, అర్థ వివరణములు తెలుగక్షరములతో యీయబడినవి. హిందీ నేర్చుకొనువారికి ఇది చాల సహాయకారి.

వెల రు. 1—4—0

ఆనందబోధిని కార్యాలయం,

సౌకార్‌పేట — మద్రాసు—1.